క్లుప్తంగా

నాగుల చెరువు విస్తీర్ణంపై 14న సర్వే

మిర్యాలగూడ : దామరచర్ల మండలం నాగుల చెరువు విస్తీర్ణంపై ఈనెల 14వ తేదీన సర్వే నిర్వహించనున్నట్లు కలెక్టర్ ఆదేశానుసారం శనివారం సబ్ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. లోకాయుక్త ఆదేశాల మేరకు రామచంద్ర మండలం నాగులచెరువు ఉమ్మడి సర్వే నిర్వహించాలని ఆదేశించారు. చెరువు ఆక్రమణకు గురైందని సర్వే నిర్వహించాలని గ్రామానికి చెందిన ధీరావత్ శ్రీను లోకాయుక్తకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆయన సమక్షంలో ఈనెల 14న సర్వే నిర్వహించాలని సూచించారు. ఈ సర్వేలో నీటి పారుదల శాఖ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్, అసిస్టెంట్ డైరెక్టర్ సర్వే, అసిస్టెండ్ డైరెక్టర్ సర్వే, తహసీల్దార్ స్థానిక అధికారుల బృందంతో ఈనెల 14న ఉదయం 8గంటలకు హాజరై పూర్తి స్థాయిలో విచారించి సాయంత్రం లోగా నివేదిక ఇవ్వాలని సబ్ కలెక్టర్ నారాయణఅమిత్ ఉత్తర్వులో పేర్కొన్నారు.

బీఆర్ఎస్‌కు మాజీ సర్పంచ్ రాజీనామా

చింతపల్లి : మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ మాజీ జిల్లా కార్యదర్శి నట్వ గిరిధర్ ఆ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2001 నుంచి, 2014 వరకు బీఆర్ఎస్ పార్టీలో క్రియాశీలకంగా పనిచేసినట్లు తెలిపారు. చింతపల్లి గ్రామ సర్పంచ్‌గా, ఎంపీటీసీగా, మండల పార్టీ అధ్యక్షుడిగా పార్టీల వివిధ హోదాలలో కొనసాగినట్లు తెలిపారు. వ్యక్తిగత కారణాలతో బీఆర్ఎస్‌ను వీడుతున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం ఏ పార్టీలో చేరే ఆలోచన లేదని గ్రామ అభివృద్ధికి కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.

ఏజీపీలుగా నియామకం


వెంకట్‌రెడ్డి


శ్రీధర్ గౌడ్

మిర్యాలగూడ టౌన్ : అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్లు(ఏజీపీ)గా గోదాల వెంకట్‌రెడ్డి, మెట్టుపల్లి శ్రీధర్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులను ఈనెల 9వ తేదీన ఉత్తర్వులు జారీ చేసింది. తిరుమలగిరి(సాగర్) మండలం బోయగూడెం గ్రామానికి చెందిన గోదాల వెంకట్‌రెడ్డి మిర్యాలగూడ కోర్టులో 20ఏళ్లుగా న్యాయవాద వృత్తిలో కొనసాగుతున్నాడు. తన నియామకానికి సహకరించిన ఆర్అండ్‌బీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, మాజీ మంత్రి జానారెడ్డి, నల్లగొండ ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డి, నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జయవీర్‌రెడ్డిలకు వెంకట్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే మిర్యాలగూడ పట్టణానికి చెందిన మెట్టుపల్లి శ్రీధర్ గౌడ్(భూ పరిపాలన)కు నియమిస్తూ ఉత్తర్వులను జారీ చేసింది. శ్రీధర్ గౌడ్ 25 ఏళ్లుగా మిర్యాలగూడ కోర్టులో న్యాయవాదిగా కొనసాగుతున్నాడు. తన నియమకానికి అన్ని విధాలుగా సహకరించిన ప్రతి ఒక్కరికి ప్రత్యేకంగా శ్రీధర్‌గౌడ్ కృతజ్ఞతలు తెలిపారు.

అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలు

వేములపల్లి : అర్హులైన పేదలందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తామని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, సబ్ కలెక్టర్ అమిత్‌నారాయణ్ అన్నారు. శుక్రవారం మండలంలోని మొల్కపట్నం గ్రామంలో డబుల్ బెడ్‌రూమ్ లబ్ధిదారులకు వారు పట్టాలను అందజేసి మాట్లాడారు. నల్లగొండ జిల్లాలో మొట్టమొదటిసారిగా డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్ల పట్టాలను మొల్కపట్నం గ్రామంలోనే అందించినట్లు తెలిపారు. నిర్మాణ సమయంలో ప్రభుత్వం ఒక్కొక్క ఇంటికి రూ.5లక్షలు మంజూరు చేయగా ఆ నిధులు సరిపోకపోవడంతో అదనంగా మరో రూ.1.25లక్షలను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. దీంతో మొత్తం 25 గృహాలకు రూ.1,25,80,000తో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణం పూర్తి చేసినట్లు తెలిపారు. ఇళ్లు లేని పేదలందరికీ డిసెంబర్ నెలలో ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మహమ్మద్ సాదత్, డిప్యూటీ తహసీల్దార్ కోటేశ్వరి, హౌసింగ్ పీడీ రాజ్‌కుమార్,


మొల్కపట్నంలో లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను అందజేస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, సబ్ కలెక్టర్

మాజీ వైస్ ఎంపీపీ పాదూరి గోవర్ధని, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు మాలి కాంతారెడ్డి, మాజీ ఎంపీటీసీ రెమదాల పరుశురాములు, నాయకులు రావు ఎల్లారెడ్డి, జడరాములుయాదవ్, నగేష్ వెంకట్‌రెడ్డి, కృపయ్య, రవీందర్‌రెడ్డి, కరుణాకర్, పాండు, ఆంజనేయులు, వెంకన్న పాల్గొన్నారు.

అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలి

- దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్

చందంపేట : తుల్జా భవాని అమ్మవారి ఆశీస్సులు రాష్ట్ర ప్రజలందరిపై ఉండాలని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ ఆకాంక్షించారు. శుక్రవారం నేరెడుగొమ్ము మండల కేంద్రంలోని పెద్దమునిగల్ గ్రామంలో తుల్జా భవాని ఆలయంలో అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు రాష్ట్రాల ప్రజలు అత్యంత భక్తిశ్రద్ధలతో అమ్మవారిని పూజిస్తారని, పెద్ద సంఖ్యలో భక్తులు ఇక్కడికి వచ్చి అమ్మవారి కృపకు పాత్రులవుతారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పూజారి జీవన్ భగత్,మండల పార్టీ అధ్యక్షుడు కృష్ణయ్య, నర్సింహా, యుగంధర్‌రెడ్డి, నర్సింహారెడ్డి, యుగంధర్ రెడ్డి, శ్రీశైలంయాదవ్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

హైమాస్ట్ లైట్లు ప్రారంభం

కొండమల్లేపల్లి : మంలడల పరిధిలోని కొల్‌ముంతలపహాడ్ గ్రామ సమీపంలోని బాపూజీనగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్‌ను శుక్రవారం దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ నాయకులు ఉట్కూరి వేమన్‌రెడ్డి, దూదిపాల రేఖశ్రీధర్‌రెడ్డి, ఎంఏ.సిరాజ్‌ఖాన్, వేణుధర్‌రెడ్డి, పస్నూరి యుగంధర్‌రెడ్డి, మాడ్గుల యాదగిరి, రవినాయక్ తదితరులు పాల్గొన్నారు.


తుల్జా భవాని అమ్మవారి ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్

పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి


రావువారిగూడెంలో నేలకొరిగిన వరి పంటను పరిశీలిస్తున్న నాయకులు

వేములపల్లి : రెండు రోజులుగా మండలంలో భారీ వర్షాలు కురవడంతో రైతులు సాగు చేసిన పంట పొలాలు నేలకొరిగాయని, పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ వైస్ ఎంపీపీ పాదూరి గోవర్ధని అన్నారు. శుక్రవారం మండలంలోని రావువారిగూడెం సమీపంలో నేలకొరిగిన పంట పొలాలను ఆమె రైతులతో కలిసి పరిశీలించి మాట్లాడారు. వ్యవసాయాధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి నష్టపోయి రైతుల వివరాలను ప్రభుత్వానికి అందించి సకాలంలో నష్టపోయిన రైతులకు ఎకరాలకు రూ.25వేల చొప్పున పరిహారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో రొండి శ్రీనివాస్, వలమల్ల ఎల్లయ్య, కోడిరెక్క వెంకన్న, భిక్షం, సుకన్య, మాధవి, లక్ష్మమ్మ, వెంకన్న పాల్గొన్నారు.

రామ్మూర్తి యాదవ్ సేవలు చిరస్మరణీయం


నివాళులర్పిస్తున్న రాజ్యసభ మాజీ సభ్యుడు బడుగుల లింగయ్య యాదవ్, కుటుంబ సభ్యులు


వేంపాడు వద్ద రామ్మూర్తి యాదవ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే భగత్

త్రిపురారం : విలువలతో కూడిన రాజకీయ నాయకుడు గుండెబోయిన రాంమూర్తి యాదవ్ సేవలు చిరస్మరణీయమని అని రాజ్యసభ మాజీ సభ్యుడు బడుగుల లింగయ్య యాదవ్ అన్నారు. శుక్రవారం చలకుర్తి మాజీ ఎమ్మెల్యే దివంగత నేత గుండెబోయిన రామ్మూర్తి యాదవ్ ఐదో వర్ధంతి సందర్భంగా త్రిపురారం మండలంలోని పెద్దదేవులపల్లిలో ఆయన చిత్రపటానికి బడుగుల లింగయ్య యాదవ్ నివాళులర్పించారు. అనంతరం ఆయన మా ట్లాడారు. పెద్దదేవులపల్లిలో రామ్మూర్తి యాదవ్ నూతన విగ్రహం ఏర్పాటుపై కుటుంబ సభ్యుల సమక్షంలో గ్రామ పెద్దలతో చర్చించారు. ఈ కార్యక్రమంలో కట్టబోయిన గురువయ్య యాదవ్, రావుల శ్రీనివాస్, రావుల రాంబాబు, చంద్రశేఖర్‌చ కోటేష్ యాదవ్, నగేష్ యాదవ్ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

రామ్మూర్తి యాదవ్‌కు నివాళి

చలకుర్తి నియోజక వర్గ మాజీ ఎమ్మెల్యే దివంగత నేత గుండెబోయిన రాంమూర్తి యాదవ్ 5వ వర్ధంతి సందర్భంగా నిడమనూరు మండలంలోని వేంపాడు స్టేజీ వద్ద నిడమనూరు, త్రిపురారం మండల బీఆర్ఎస్ నాయకులతో కలసి ఆయన విగ్రహానికి సాగర్ మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ నివాళులర్పించారు. ఈ సందర్భంగా పేదలకు పండ్లు పంపిణీ చేశారు. భగత్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నిడమనూరు అధ్యక్షుడు తాటి సత్యపాల్, కూరాకుల వెంకటేశ్వర్లు, రవి నాయక్, పిడిగం నాగయ్య, రవి, వెంకటాచారి, జంగిలి శ్రీనివాస్, రామలింగం, రమేష్, కృష్ణ, బాలరాజు, రాంబాబు, జానకి రాములు, భాస్కర్,తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి

దేవరకొండ : భారతీయ జనతా పార్టీ(బీజేపీ) బలోపేతానికి పార్టీ కార్యకర్తలు కృషి చేయాలని ఆ పార్టీ ఎస్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కళ్యాణ్‌నాయక్ పిలుపునిచ్చారు. శుక్రవారం దేవరకొండ పట్టణంలో ఎస్టీ మోర్చా ఆధ్వర్యంలో నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో దేశం నేడు అన్ని రంగాల్లో ముందుకెళ్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సురేష్, మల్లేష్‌నాయక్, వినోద్‌రాథోడ్, అంకూరి నర్సింహ, గుండాల అంజయ్య, జల్దా భాస్కర్, రవికుమార్ పాల్గొన్నారు.

వీధి దీపాలు ఏర్పాటు చేయాలని ధర్నా


ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న చామలేడు గ్రామస్తులు

గుర్రంపోడు : మండలంలోని చామలేడు గ్రామంలో వీధి దీపాలు వెలగడం లేదని ఆ గ్రామస్తులు శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. పండుగ సందర్భంగా కొత్త వీధి లైట్లు బిగించాలని పంచాయతీ కార్యదర్శికి పలుమార్లు విన్నవించినా పట్టించుకోలేదని, పండుగ రోజుల్లో వీధుల్లో అంధకారం నెలకొనే పరిస్థితి ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పంచాయతీ నిధులు దుర్వినియోగం అవుతున్నాయని ఆరోపించారు. ఓటర్లను ఇష్టం వచ్చినట్లు వార్డులకు మార్పిడి చేస్తున్నారని ఆరోపించారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి భాగ్యను వివరణ కోరగా గ్రామంలో 140 స్తంభాలకుగాను 60 వీధిలైట్లు వెలుగుతున్నాయని, వెలగని 80 వీధిలైట్లను శుక్రవారం రాత్రి వరకు బిగించే పనిలో ఉన్నామని వీధిలైట్లు వేసే మెకానిక్‌ల కొరత కారణంగా జాప్యం జరుగుతుందని తెలిపారు. శనివారం నాటికి అన్ని వీధుల్లో లైట్లు వేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శివకుమార్, శంకర్, యాలాద్రి, శ్రీను, శ్రీకాంత్, రాంబాబు, లింగస్వామి. రవి పాల్గొన్నారు.

ఆర్టీఐఏపై అవగాహన కల్పించాలని వినతి

మిర్యాలగూడ : సమాచార హక్కు చట్టం (ఆర్టీ ఐఏ) 2005 ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆ చట్టం గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని మిర్యాలగూడ సమాచార హక్కు చట్టం వికాస సమితి అధ్యక్షుడు ఎండీ.అబ్దుల్ కలీమ్ అన్నారు. శుక్రవారం సబ్ కలెక్టర్, తహసీల్దార్, ఎంపీడీఓ, ఏఓ కార్యాలయాల్లో ఆయన వినతిపత్రాలు అందజేసి మాట్లాడారు. అక్టోబర్ 12, 2005న సమాచార హక్కు చట్టం ఆవిర్భవించిందని, ఈనెల 14 నుంచి 19వరకు అన్ని ప్రభుత్వ కార్యాలయాల ఆధ్వర్యంలో క్విజ్, వ్యాసరచన పోటీలు నిర్వహించి అవగాహన కల్పించాలని సంబంధిత అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో ఎండీ.సల్మాన్, బైరం కృష్ణ, పిన్నం యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

'సీఎం ఇంటి ముట్టడి' పోస్టర్ ఆవిష్కరణ

మిర్యాలగూడ టౌన్ : లంబాడీలకు మంత్రి పదవి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఈనెల 21న తలపెట్టిన సీఎం రేవంత్‌రెడ్డి ఇంటి ముట్టడి కార్యక్రమ పోస్టర్‌ను శుక్రవారం గిరిజన విద్యార్థి సంఘం నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి ధీరావత్ కోట్యానాయక్ మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత గిరిజనులకు మంత్రి పదవిని ఇవ్వకపోవడం దురదృష్టకరంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు లావూరి రవీందర్ నాయక్, జిల్లా నాయకులు అంకుడోతు అఖిల్‌నాయక్, ఇస్లావత్ అంజినాయక్, లావూరి రామారావునాయక్ తదితరులు పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ


మృతురాలి కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ : దామరచర్ల మండలం వీర్లపాలెం గ్రామానికి చెందిన రైతు కూలి మాలోతు హనిమి గురువారం పిడుగుపాటుకు గురై మృతిచెందింది. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి శుక్రవారం గ్రామానికి చేరుకోని హనిమి మృతదేహాన్ని సందర్శించి పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబసభ్యులను పరామర్శించి మాట్లాడారు. అధికారులతో మాట్లాడి కుటుంబసభ్యులకు ఆర్థిక సాయం అందేలా కృషిచేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం పిడుగుపాటుకు గురై గాయపడిన రైతులను ఆయన పరామర్శించారు.


పీఏసీఎస్ భవనం పరిశీలన

త్రిపురారం : నిడమనూరు మండలంలోని రేగులగడ్డలో శిథిలావస్థలో ఉన్న ప్రాథమిక సహకార సంఘం భవనాన్ని శనివారం చైర్మన్ ఇరిగినేని అంజయ్య పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రేగులగడ్డలో పీఏసీఎస్ భవనం కొన్నేళ్లుగా వినియోగంలో లేకపోవడంతో నిరుపయోగంగా మారి శిదిలావస్థకు చేరిందన్నారు. మరమ్మతులు చేపట్టి భవనాన్ని తిరిగి వినియోగంలోకి తీసుకొస్తామని స్థానిక రైతులకు ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు, పీఏసీఎస్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

తవక్లాపూర్‌లో రక్తదాన శిబిరం

డిండి : మండల పరిధిలోని తవక్లాపూర్ గ్రామానికి చెందిన వేముల శ్రీకాంత్ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. శుక్రవారం శ్రీకాంత్ జ్ఞాపకార్థంగా దాదాపు 65మంది స్నేహితులు తవక్లాపూర్‌లో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారి వద్ద నుంచి సేకరించిన 13లీటర్ల రక్తాన్ని ఎస్ఎల్ఎంఎస్ ఆస్పత్రి బ్లడ్ బ్యాంక్‌కు అప్పజెప్పినట్లు వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వేణు, రాజు, అంజి,శమిద్, బాబర్, రమేష్, గణేష్, అరవింద్, వెంకటరమణ, పావని తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన టెన్నికాయిట్ టోర్నమెంట్


విజేతలకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

రామగిరి(నల్లగొండ): దసరా పండుగ సందర్భంగా స్థానిక ఎన్జీ కళాశాల మైదానంలో టెన్నికాయిట్ క్రీడాకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రెండు రోజులుగా జరిగిన టెన్నికాయిట్ టోర్నమెంట్ శుక్రవారం ముగిసింది. డబుల్స్‌లో మొదటి బహుమతి టి.సోమయ్య, కె.కరుణాకర్, రెండో బహుమతి ఎస్.నాగిరెడ్డి, దర్శనం వెంకటయ్య గెలుపొందారు. సింగిల్స్‌లో మొదటి బహుమతి ఎస్.నాగిరెడ్డి గెలుపొందారు. అతిథి హాస్పిటల్ ఎండీ రావుల విజేందర్‌యాదవ్ విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జిట్టా రాములు, నకిరేకంటి మారయ్య, నర్సింహ, ఏడుకొండలు, వెంకన్న, పీడీలు శంభులింగం, వెంకట్, నాగరాజు, క్రీడాకారులు పాల్గొన్నారు.